అంగన్‌వాడీల భర్తీ ఎప్పుడో?



- జిల్లాలో 165 టీచర్, 447 ఆయా పోస్టులు ఖాళీ
- ఇబ్బందులు పడుతున్న బాలింతలు, గర్భిణులు, పిల్లలు
- కొన్ని కేంద్రాల బాధ్యతలు ఇన్‌చార్జిలకు..
- అదనపు భారంతో సిబ్బందికి అవస్థలు

బెజ్జూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలో బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బం దులు పడుతున్నారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేం ద్రాల టీచర్లకు అప్ప గించడంతో వారిపై అదనపు భారం పడుతోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలకు నిలయంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా ఆసిఫాబాద్, జైనూరు, వాంకిడి, సిర్పూర్, కాగజ్‌నగర్‌లో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 973అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో ఉన్న ఖాళీలను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ మేరకు జూలై నెలలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. ఖాళీగా ఉన్న పోస్టుల ను భర్తీ చేస్తే అటు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి మేలు జరగడమే కాకుండా ఇటు నిరుద్యోగులకు సైతం ఉపాధి కల్పిం చినట్లుఅవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

● ఐసీడీఎస్ పరిధిలో..

ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలదే క్షేత్రస్థాయిలో కీలకపాత్ర. ఓ వైపు స్వంత అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు పలు రకాల సేవలు అందిస్తూ, వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టే కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. బూత్ లెవల్ అధికారులుగా ఎన్నికల విధుల్లో సేవలు అందిస్తున్నారు. ఖాళీలు భర్తీ అయితే ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పని భారం తగ్గడంతో పాటు కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 నెలల శిశువులు3,457, 7నెలల నుంచి 3ఏళ్ల పిల్లలు 20,357, 3-7ఏళ్ల పిల్లలు 20,100 మంది ఉన్నారు. గర్భిణులు 4,635, బాలింతలు 3,422మంది ఉన్నారు.

● జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు..

ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిదిలో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 165టీచర్, 447ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈనేపథ్యంలో సిబ్బంది కొరత ఉన్న కేంద్రాల్లో ఇన్‌చార్జిలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు సరైన సేవలు అందడం లేదు. ఇప్పటికే రాష్ట్ర మంత్రి భర్తీపై ప్రకటన చేసిన నేపథ్యంలో నిరుద్యోగ మహిళల్లో ఆశలు రేకెత్తించాయి. జిల్లాలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేస్తేనే అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి ప్రకటించి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ దీని ఫైలు కదలిక లేకపోవడంతో నిరుద్యోగ మహిళల్లో ఆందోళన మొదలైంది. ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించి మూడు నెలలు కావస్తోంది. అయితే అధికార వర్గాల నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేకపో వడంతో నిరుద్యోగుల ఆశలు నెరవేరేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి కైనా అధికారులు స్పందించి జిల్లాలోని ఖాళీగా ఉన్న అంగన్ వాడీ కేంద్రాల్లోని పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగ మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

- ఆడెపు భాస్కర్, జిల్లా సంక్షేమ అధికారి, ఆసిఫాబాద్



జిల్లాలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయాల పోస్టుల భర్తీ కోసం గతంలోనే ప్రభుత్వా నికి నివేదించాం. జిల్లాలో టీచర్, ఆయాల పోస్టులు 612వరకు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలోని ఖాళీల వివరాలు సేకరించి నివేదించాం. ప్రభుత్వం అనుమతిస్తే భర్తీకి చర్యలు తీసుకుంటాం.

కాగజ్‌నగర్‌లో సంఘమిత్ర రైలుకు హాల్టు



సంఘమిత్ర రైలు డ్రైవర్‌కు స్వీటు ఇస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు రైల్వే అధికారులు హాల్టునిచ్చారు. శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్‌కు చేరుకోవటంతో ఎమ్మెల్యే మరీష్ బాబు జెండా ఊపిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను కేటాయించినట్టు తెలిపారు. ఈ నెల 18న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఆగుతుందన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రారంభించకుంటే పోటీ చేయను



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కౌటాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ ప్రాజెక్టు వచ్చే ఎన్నికల లోపు ప్రారంభించకుంటే ఎమ్మెల్యే ఎన్నికల్లో తాను పోటీ చేయనని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రకటించారు. శనివారం కౌటాల మండలంలోని గుండాయిపేట, బాలేపల్లి, పాలేపల్లి, వాయిగాం, తాటిపల్లి తదితర గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిర్పూరు నియోజకవర్గానికి ప్రధాన ఆధారమైన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ ప్రకటించారు. 2028 ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు అడగమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరుపై మొక్క నాటి సంరక్షించాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి తల్లి పేరుమీద ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జీ డీఈఓ దీపక్ తివారి అన్నారు. సోమవారం 'ఏక్ పేడ్ మాకేనామ్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపడుతామని తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

వాంకిడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్సీ ఎస్టీ అట్రసిటీ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం మాట్లాడారు. కార్యక్ర మంలో రేగుంట కేశవరావు, అశోక్, గోపాల్, గణేష్, శ్యాంరావు, పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. శనివారం రెబ్బెన మండల కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో పరికిపండ్ల నరహరి ఐఎఎస్ నిర్మించిన ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉచితి కంటి వైద్య శిబిరాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో పరికిపండ్ల రాము, శోభన్‌బాబు, మిట్టపల్లి రాజేందర్, ప్రజా ప్రతినిధులు ఆజ్మీర శ్యాం నాయక్, వైద్యులు పాల్గొన్నారు.

'అక్రమ కేసులు సరికాదు'

ఆసిఫాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ, పీఎంపీలపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని ఆసిఫాబాద్ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నాయకులు నారాయణ, తిరుపతి చారి, కేదారిగౌడ్ అన్నారు. స్థానికంగా శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఆర్ఎంపీ, పీఎంపీలు వెంకన్న, శ్రీనివాస్‌చారి, మల్లేష్, లక్ష్మణ్, సందీప్, శ్రీకాంత్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించే ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆసిఫాబాద్, వాంకిడి ఫొటో, వీడియో గ్రాఫర్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సందీప్, ప్రధాన కార్యదర్శిగా వివేక్, కోశాధికారిగా హమీద్ ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు మహేష్, రామన్న, సమీర్, సతీష్, వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

బెజ్జూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు పోలీసు స్టేషన్‌ను శనివారం కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదొద్దీన్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.. ఆయన వెంట ఎస్సై సర్తాజ్‌పాషా ఉన్నారు.

సీపీఎం నాయకుడికి ఘన నివాళి

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటరమణ వర్ధంతి సందర్భంగా శనివారం పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వంజిరి, తుంగెడ, బట్టుపల్లి గ్రామాలతో పాటు కాగజ్‌నగర్ పార్టీ కార్యాలయాల్లో పార్టీ జిల్లా కారదర్శి కూశన రాజన్న, శ్రీనివాస్, సుదర్శన్, ఆనంద్, రవి, కృష్ణమాచారి, మేరాజ్, తులసీరాం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల్లో కాగజ్‌నగర్ బాలురు-1 మైనారిటీ పాఠశాల/కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రోమి ప్రతిభ తెలిపారు. ఎంపికైన జానకిరామ్, ప్రణయ్, విష్ణు, కార్తీక్, విష్ణును పలువురు అభినందించారు.

యూరియా కోసం రైతుల బారులు



పెంచికలపేటలో ఏవో మనీషాతో వాగ్వాదం చేస్తున్న రైతులు



బెజ్జూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

బెజ్జూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు బారులు తీరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘానికి శనివారం యూరియా బస్తాలు రావడంతో వివిధ గ్రామానికి చెందిన రైతులు పెద్దమొత్తంలో వచ్చి వరుసలో నిలబడ్డారు. ఒక్కో రైతుకు కేవలం 2నుంచి 3బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఒక్కసారిగా సహకార సంఘానికి రైతులు తరలిరావడంతో సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల పహారా మధ్య యూరియాను రైతులకు అధికారులు పంపిణీ చేశారు. యూరియా కోసం వచ్చిన రైతులకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో రైతులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు భషరత్‌ఖాన్, అమీరొద్దీన్, పుల్లూరి సతీష్, తంగడిపల్లి మహేష్, శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, జాహీద్‌హుస్సేన్, ఇస్తారి, రవి, హనుమంతు, సాయన్న, శౌకత్, సకరాం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి) చింతలమానేపల్లి మండలంలోని బాలాజీఅనుకోడ రైతు వేదిక వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఉదయం నుండి యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా కొరత కారణంగా ఇన్ని రోజులుగా రైతులకు సరిపడా అందకపోవడంతో రైతులు ఉదయం నుండి బారులు తీశారు. అయితే రైతులకు టోకెన్లు కేటాయించి ఒక్కో రైతులకు కేవలం2 బస్తాలు మాత్రమే పంపిణీ చేస్తున్నారని భూమి ఎంత సాగు చేసినమో దానికి సరిపడా యూరియా ఇవ్వడం లేదని రైతులు ఆందోళన చేశారు. ఒక్కో రైతుకు కేవలం రెండు యూరియా బస్తాలు ఇస్తే ఎన్ని సార్లు యూరియా కోసం తిరుగాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా పంపిణీ కేంద్రం వద్ద ఎస్సై ఇస్లావత్ నరేష్, డిప్యూటి తహసీల్దార్, ఇతర పోలీస్ సిబ్బంది, వ్యవసాయ మండల అధికారి కార్తేషా, ఏఈఓలు రైతులకు నచ్చజెప్పుతూ యూరియా పంపిణీ చేశారు.

తిర్యాణి,(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలో ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా వచ్చిందని సమాచారం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే కార్యాలయం ఎదుట బారులు తీరారు. ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసు పహరా మధ్య యూరియాను పంపిణీ చేశారు. విడతల వారిగా యూరియాను రైతులకు అందిసామని ఏవో వినయ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ తెలిపారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతన్నకు యూరియా సకాలంలో లభించక అవస్థలు పడుతున్నారు. శనివారం దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయంలో యూరియా పంపిణీ చేస్తున్నరన్న సమాచారంతో పీపీరావు కాలనీ, హత్తిని, దహెగాం, కమ్మర్‌పెల్లి, లగ్గాం, మర్రిపెల్లి, ఐనం తదితర గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం ఏడు గంటలకే వరసు కట్టారు. వృద్దులు, చంటి పాపల తల్లులు, మహిళ రైతులు యూరియా కోసం బారులు తీరారు. పోలీసు బందోబస్తు మధ్య యూరియా బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, ఏవో రామకృష్ణ, పీఏసీఎస్ సీఈఓ బక్కయ్య ు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట, (ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద శనివారం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. యూరియా లోడ్ వస్తుందని అధికారులు ముందుగానే తెలుపడంతో ఉదయం ఏడు గంటల వరకే భారీ సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకున్నారు. సమయం 11:30 అయిన వ్యవసాయాధికారి మనీషా అక్కడికి రాకపోవడంతో ఎండలోనే రైతులు నిరీక్షించాల్సి వచ్చింది. ఎస్సై అనిల్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులకు సర్దిచెప్పి క్యూలైన్‌లో నిలుచొబెట్టారు. వ్యవసాయాధికారి అక్కడికి రాగానే రైతులు వాగ్వాదానికి దిగారు. సమయ పాలన పాటించడంలేదని సరిపడ యూరియా రైతులకు అందడంలేదని ఆమెను ప్రశ్నించారు. ఉయదం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లో నిలుచున్న కొంతమంది రైతులకే యూరియా బస్తాలు అందాయని ఆవేదన చెందుతున్నారు.

సిర్పూరు(టి), (ఆంధ్రజ్యోతి): సిర్పూరు(టి) సహకార బ్యాంకు వద్ద వ్యవసాయాశాఖ అధికారి గిరిష్ కుమార్ ఆధ్వర్యంలో రైతులందరికి యూరియాను శనివారం పంపిణీ చేశారు. మధ్యాహ్నం కావటంతో వారికి సహాయం మాజీ ఎమ్మెల్యే కోనప్ప ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోనప్ప వర్గీయులు సయ్యద్ కీజర్ హుస్సేన్, మాజీ ఎంపీటీసీ దుర్గం విక్రం, ఉప సర్పంచి తంగెడిపల్లి సంతోష్, వార్డు సభ్యుడు ఇఫత్ హుస్సేన్, ఉప సర్పంచి తోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చింతలమానేపల్లిలో రైతు వేదిక వద్ద వేచి ఉన్న రైతులు



సిర్పూర్(టి)లో యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మూడు కుటుంబాల్లో విషాదం

- వాగులో మునిగి దాబా గ్రామానికి చెందిన నలుగురి మృతి
- మృతుల్లో తల్లీకొడుకు, మరో ఇద్దరు చిన్నారులు



రోదిస్తున్న బంధువులు

వాంకిడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం దాబా గ్రామంలో శనివారం మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన నలుగురు ఒకే రోజు ప్రమాదవశాత్తు నీట మునుగడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. దాబా గ్రామానికి చెందిన మోహర్లే మహేందర్, నిర్మలాబాయి(33) దంపతులకు కుమార్తే లలిత(14) కుమారుడు గణేశ్(12) ఉన్నారు. శనివారం యూరియా సంచులు కడిగేందు కు నిర్మలాబాయితో పాటు లలిత, గణేశ్ వీరి సమీప బంధువులు ఆదే శేఖర్ కుమార్తే ఆదే శశికళ((8) వాడైవార్లు కుమార్తే మహేశ్వరి (10)తో కలిసి సమీపంలోని వాగుకు వెళ్లారు. యూరియా సంచులు కడుగుతున్న సమయంలో ఒక సంచి నీటిలో కొట్టుకుపోయింది. గణేశ్ సంచిని పట్టుకోవడానికి వెళ్తున్న క్రమంలో వాగులో నీరు ఎక్కువగా ఉండడంతో మునిగి పోయాడు. కుమారుడిని వెతికేందుకు వెళ్లిన తల్లి నిర్మలాబాయి సైతం నీటిలో మునిగి పోయింది. వాగు ఒడ్డున ఉన్న శశికళ, మహేశ్వరి వారి కోసం వెళ్లగా నీటిలో మునిగి పోయారు. వాగు సమీపంలో ఉన్న లలిత తండ్రికి, స్థానికులకు సమాచారం అందించింది. గ్రామస్థులు అక్కడికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. సమాచారం మేరకు సీఐ సత్యనారాయణ, ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెసుకున్నారు. ఎస్పీ ప్రశాంత్ పాటిల్ వివరాల అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలకు పంచనామా చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. గణేశ్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. శశికళ, మహేశ్వరి వాంకిడిలోని గ్లోబల్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు.

క్రీడాకారులు నిరంతరం సాధన చేయాలి

రెబ్బెన, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, వాటిని పట్టించుకోకుండా నిరంతరం సాధన చేసే వారికి ఓటమి ఉండదని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం గోలేటి సింగరేణి పాఠశాల మైదానంలో 92వ వార్షిక క్రీడా పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడలతో శారీరక దారుఢ్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్యా మొగిలి, అధికారుల సంఘం నాయకులు ఉజ్వల్ బెహర తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): గోలేటి క్రాస్ రోడ్డు నుంచి ఖైరిగూడ ఉపరితల గని వరకు ఉద్యోగుల రాక పోకలకు బస్సు సౌకర్యాన్ని బెల్లంపల్లి జీఎం ఎంవిజయభాస్కర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. మూడు షిఫ్టుల ఉద్యోగులను విధులకు తీసుకెళ్లడం, తిరిగి గోలేటి క్రాస్ రోడ్డు వరకు వెళ్లుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీవో మచ్చగిరి నరేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, మేనేజర్ జె.శంకర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం



కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి రమేశ్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యో తి): లోక్ అదాలత్‌ల ద్వారానే సత్వర న్యా యం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎంవీ రమేష్ అన్నారు. జిల్లా కేం ద్రంలోని కోర్టు సముదాయం భవనంలో శని వారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిం చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలోని ఆయా కోర్టుల పరిధిలో మొత్తం 8,811 కేసులను పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ యువరాజా, జూనియర్ సివిల్ జడ్జీ అనంతలక్ష్మి, బార్ ఆసోసియోషన్ అధ్యక్షులు రాపర్తి రవిందర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ రోడ్లు నిర్మించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు చోట్ల డబుల్ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. ఎమ్మెల్యేను శనివారం తన నివాసంలో రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తలోడి-సల్గుపల్లి మధ్యఉన్న సింగిల్ రోడ్డు సమస్య, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాలకు డబుల్ రోడ్డును చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులైన సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద నిధులు విడుదల చేసేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో యూరియా పంపిణీని శనివారం ఎమ్మెల్యే హరీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కాసేపు మాట్లాడారు. అలాగే అధికారులతో మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో యూరియాను పంపిణీ చేయాలని సూచించారు.

ముట్టడికి తరలిరావాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించే తహసీల్దార్ కార్యాలయాల ముట్టడికి లబ్ధిదారులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రేగుంట కేశవరావు కోరారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్ పెంచి చెల్లిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. అన్ని పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు పింఛన్ల పంపిణీని మాత్రం పట్టించుకోవడం లేదని చెప్పారు. వేలాది మంది లబ్ధిదారులు పింఛన్ల పెంపు కోసం వేచి చూస్తున్నారని ప్రభుత్వం దీనిపై నిర్ణయం ప్రకటించాలని కోరారు. ఈనెల 20న జిల్లా లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అక్టోబరు 6 నుంచి నవంబరు 6 వరకు నెలరోజుల పాటు నిరసన దీక్షలను నిర్వహించనున్నామని తెలిపారు.

కూరుకుపోతున్నాయ్..

- బురదలో దిగబడుతున్న వాహనాలు
- రాకపోకలకు గ్రామస్థులకు తప్పని ఇక్కట్లు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం

బెజ్జూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో రోడ్లు వర్షాలకు నీరు నిలిచి బరదగా మారడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. బెజ్జూరు మండల కేంద్రంలోని పలు గిరిజన గ్రామాల ప్రజలు వెళ్లే రోడ్డు... ఆయా గ్రామాల ప్రజలు నిత్యం వివిద అవసరాల నిమిత్తం మండల కేంద్రమైన బెజ్జూరుకు వస్తుంటారు. ఉన్నత చదువుల కోసం పాఠశాల విద్యార్థులు కూడా బెజ్జూరుకు వస్తుంటారు. కానీ ఆ రోడ్డు మా త్రం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారి నడవడానికి కూడా లేని పరిస్థితి ఉంది. ఈ రోడ్డు మీదుగా దాదాపు 10గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎన్నో ఏళ్లుగా ఇవే తిప్పలు పడుతున్నా ఏ ఒక్కరూ స్పందించడం లేదని గిరిజన గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం సోమిని గ్రామం నుంచి పాఠశాల విద్యార్థులను బెజ్జూరుకు తీసుకువస్తుండగా టాటాఏసీ వాహనం బురదలో కూరుకుపోయింది. దీంతో గ్రామస్థులు అతికష్టం మీద వాహనాన్ని ట్రాక్టర్‌కు కట్టి వెనుకనుంచి తోలి బయటకు తీశారు.


పాఠశాల వాహనాన్ని లాగుతున్న ట్రాక్టర్


లింగాపూర్‌లో కూరుకుపోయిన ఆటోను తోస్తున్న విద్యార్థులు

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. ఇటీవల పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో బురదలో కూరుకుపోయింది. దీంతో విద్యార్థులు, స్థానికులు అతి కష్టంపై దాన్ని బయటకు లాగారు. మండలంలోని చిన్నదంపూర్ గ్రామ పంచాయతిలో గల పూల్‌సింగ్‌తండా, కిమానాయక్ తండా గ్రామాల పరిధిలో సుమారు 50 మంది విద్యార్థులు నిత్యం విద్యాభ్యాసం కోసం లింగాపూర్ మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల పరిధిలో తారు రోడ్ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో మట్టి రోడ్లపైనే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం కురిసి రోడ్లపై వరదనీరు చేరితో వాహనాల రాకపోకలకు గుంతలు పడుతున్నాయి. వర్షం నీరు ఇంకిపోయినా బురదగా మారిన రోడ్లపై చిన్న వాహనాలు కూరుకుపోతున్నాయి. పూల్‌సింగ్ తండా, కిమానాయక్‌తండా నుంచి లింగాపూర్ మండల కేంద్రం సుమారు 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇందులో 6 కిలోమీటర్లు మేర బురద రోడ్డే ఉంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో నిధులు మంజూరైనా..

గతంలో కుశ్నపల్లి నుంచి సోమిని వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు కూడా చేసింది. అయితే అటవీ అనుమతులు లేవన్న కారణంతో రోడ్డు పనులు ఆగిపోయాయి. తాము అటవీ గ్రామాల్లో పుట్టడమే శాపమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. కుశ్నపల్లి అవుతల ఉన్న సుశ్మీర్, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, నాగేపల్లి, పాత సోమిని, గెర్రెగూడ, బండలగూడ, చింతలపల్లి తదితర గ్రామాల ప్రజలకు ప్రతి ఏటా వర్షాకాలంలో వారు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. దశాబ్దాలుగా రోడ్డు లేక అనేక ఇబ్బందులు పడుతున్నా తమ గోడును ఏ ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని వాపోతు న్నారు. కనీసం రోగమొస్తే వైద్యం కోసం కూడా వెళ్లలేని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు.

గర్భిణులు ప్రసవం కోసం వెళ్లాలన్నా కనీసం 108వాహనం కూడా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని చెబుతు న్నారు. గ్రామాల మధ్య రెండు లోలెవల్ వంతెనలపై హైలెవల్ వంతెనలు లేక వాగు ఉప్పొంగినప్పుడల్లా రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన చెందుతున్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాలైన షాకన్‌గోంది, మాలన్ గోందిలలో శనివారం ఆడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వ ర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధి కారి వినోద్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సరిత, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన పోడు లొల్లి

- గిరిజనుల గుడిసెలు తొలగించేందుకు అధికారుల యత్నం
- లింగాపూర్ ఫారెస్ట్ బీట్‌లో ఉద్రిక్తం
- వందలాది మంది అటవీ సిబ్బంది మోహరింపు
- 13మంది మహిళల అరెస్టు


లింగాపూర్ అటవీ బీట్‌లో కందకాలు తవ్విస్తున్న అధికారులు

దండేపల్లి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలో పోడు వ్యవసాయం గొడవ రోజు రోజుకూ ముదురుతోంది. లింగాపూర్ బీట్‌లో సాగు చేస్తున్న పంటలతో పాటు తాత్కాలికంగా వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు శనివారం ఉదయం జన్నారం డీఎఫ్‌వో రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వందలాది మంది అటవీ శాఖ అధికారులతో పాటు సిబ్బంది అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం ఫారెస్ట్‌సిబ్బందిపై కొందరు గిరిజనులు దాడి చేయడంతో తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మారావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో శనివారం వందల మంది అటవీ అధికారులు, సిబ్బంది కర్రలతో లింగాపూర్ అటవీ బీట్‌లో 380 కంపార్ట్ మెంట్ వద్దకు శనివారం భారీగా చేరుకున్నారు. మండలంలోని ధమ్మనపేట, మామిడిగూడ చెందిన ఆదివాసీ గిరిజనులు పోడు వ్యవసాయం కోసం మూడు నెలలుగా అటవీ భూమిని ఆక్రమించి వ్యవసాయం పేరిట అక్కడే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. చదును చేసిన భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో వీరికి ఇటీవల మంచిర్యాల కలెక్టర్, అటవీ శాఖ, పోలీసు శాఖల అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నిసార్లు కౌన్సెలింగ్ చేసి, బైండోవర్ చేసినప్పటికీ గిరిజనులు అక్కడి నుంచి వెళ్లడం లేదు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం అక్కడకు వెళ్లిన ఫారెస్ట్ సిబ్బందిపై గిరిజనులు కారంపొడి చల్లి కర్రలతో దాడికి పాల్పడ్డారు. విధి నిర్వహణలో ఉన్న ఫారెస్టు సిబ్బందిపై దాడి చేయడంతో శనివారం ఉదయం అటవీ శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో సాగు చేసిన పంటలు, తాత్కాలిక గుడిసెలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నించారు. కానీ గిరిజనులు అక్కడ ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గిరిజనులకు ఎంత చెప్పినా వినకపోవడంతో ఫారెస్టు సిబ్బందిపై దాడి చేసిన 13 మంది గిరిజనులను అరెస్టు చేసి దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. మరోవైపు విషయం తెలుసుకున్న మీడియా అక్కడి వెళ్లగా అటవీ ప్రాంత సమీపంలో సిబ్బంది లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో జర్నలిస్టులు మూడు గంటల పాటు నిరసన ఆందోళన చేపట్టారు.

మహిళలు స్నానం చేస్తుండగా చూసినందుకే...

శుక్రవారం సాయంత్రం వాగులో స్నానం చేస్తున్న సమయంలో ఫారెస్ట్ సిబ్బంది చెట్ల పొదల చాటున ఉండి చూడడంతో గిరిజన మహిళలు కేకలు వేశారు. ఇది చూసిన ఫారెస్ట్ సిబ్బంది అక్కడి నుంచి పరుగులు పెట్టడంతో వారిని వెంబడించి స్నానం చేస్తుండగా చూడడం ఎమిటని ప్రశ్నించామే తప్ప వారిపై తాము దాడి చేయలేదని గిరిజన మహిళలు చెప్పుకొచ్చారు. తమపై దాడి చూశారంటూ కేసులు కూడా నమోదు చేశారని ఆదివాసి గిరి జన మహిళలు వాపోయారు. ఇదిలా ఉండగా కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ కావడంతో అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేయడం నేరమని, దీనిపై పలుమార్లు గిరిజ ను లుకు కౌన్సెలింగ్ ఇచ్చామని జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ అన్నారు. దీనిపై పలు మార్లు అవగాహన కల్పించిన వారి తీరు మారలేదన్నారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై గిరిజన మహిళలు కారం పొడి చల్లి కర్రలతో దాడి చేశారన్నారు. అయినా తాము సహనం వహించామని వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాండూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌శివారులో పేకాటరాయుళ్ల ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి దాడికి పాల్పడ్డామన్నారు. దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 1090 ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా పేకాట ఆడినా, అసాంఘీక కార్యక లాపాలకు పాల్పడిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

నస్పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని సీతారాంప ల్లి రోడ్డులో నివాసం ఉంటూ కనిపించకుండా పోయిన సింగరేణి రిటైర్మెంట్ కార్మికుడు తోట రాజయ్య (56) మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం గోదావరి నదిలో గుర్తించాడు. రెండేళ్లుగా పక్షవాతంతో బాధ పడుతున్న రాజయ్య ఫిజియోథెరపీకి అని చెప్పి ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. శుక్రవారం సాయంత్రం మంచిర్యాల గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యు లు వెళ్లి చూసి గుర్తించారు. శనివారం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై జితేందర్ సింగ్ తెలిపారు.

చదువుకోవడం ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్య


సుప్రియ(ఫైల్)

బెల్లంపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో చదువుకోవడం ఇష్టంలేక సుప్రియ(14) అనే 9వ తరగతి విద్యార్థిని శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఆకెనపల్లి గ్రామానికి చెందిన ఎగ్గెవార్ రామాజీ లక్ష్మీ దంపతులు కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లున్నారు. వీరిలో రెండవ కూతురు సుప్రియ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కొన్ని రోజుల నుంచి సుప్రియ పాఠశాలకు సరిగ్గా వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటోంది. తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లాలని సుప్రియను మందలించారు. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం ఇంట్లోని ఎలుకల మందు గుళికలను మిగింది. అనంతరం విషయాన్ని తల్లిదండ్రు లకు చెప్పడంతో వారు వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుప త్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తుం డగా పరిస్థితి విషమించి సుప్రియ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై యువకుడు..


సాగర్‌గౌడ్ (ఫైల్)

భీమిని, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఏగోళం సాగర్‌గౌడ్(29) అనే యువకుడు మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాగర్ గౌడ్ కొన్నేళ్లుగా మద్యానికి బానిసై ఇంటి వద్ద ఉంటున్నాడు. తనకు వివాహం చేయమని తల్లితో తరుచూ గొడవ పడుతుండే వాడు. ఇదే క్రమంలో శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి ప్రైవేటు వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. సాగర్ తల్లి భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

తాండూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేచిని గ్రామానికి చెందిన రాచకొండ వెంకటేష్ (35) అనే వ్యక్తి శనివారం మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వెంకటేష్ మద్యానికి అలవాటు పడి భార్య పిల్లల బాగోగులు చూడక పోవడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన వెంకటేష్ మ ద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుం బీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు


మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్

లింగాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్యా కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వైరల్ జ్వరాలు ప్రబలకుండా చూడాలని చెప్పారు. గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వయంగా గ్రామం అంతా తిరిగి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట రాష్ట్ర సహాయకులు సైదులు. జిల్లా వైద్యాధికారి సీతారాం. డీడీవో ఉదయ్‌కిరణ్, లింగాపూర్ డాక్టర్ అనిత తదితరులు ఉన్నారు.

సింగరేణి సమాచారం

క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం


క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెస్క్యూ పోటీల్లో క్రీడాకారులు చూపిన ప్రతిభ చూపడం అభినందనీయమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో రామగుండం-2 ఏరియాలో జరిగిన 54వ జోనల్ మైన్స్ రెస్క్యూ కాంపిటేషన్‌లో శ్రీరాంపూర్ ఏరియాకు మూడు బహుమతులు రావడంతో వారిని శనివారం అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, ఆపరేటర్స్ టెస్టింగ్, బెస్ట్ డ్రిల్, పరేడ్‌లో మొదటి బహుమతి వచ్చిందన్నారు. ఓవరాల్ కాంపిటేషన్‌లో మూడో బహుమతి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో నాగపూర్‌లో జరిగే ఆలిండియా మైన్స్ రెస్క్యూ కాంపిటేషన్‌కు శ్రీరాంపూర్ ఏరియా నుంచి జి. శంకర్, ఆర్. సురేష్ ఎంపికైనందున వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఆర్‌కే 5 గని ఏజెంట్ శ్రీధర్, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్ రెడ్డి, రెస్క్యూ ఇన్‌చార్జి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘంగా కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కార మే ధ్యేయంగా సీఎండీతో నిర్వహించాల్సిన స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించా మని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. ఏరియాలోని కేకే 5 గనిపై శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు కావస్తున్నా లాభాల వాటా చెల్లించకపోవడం దారుణమ న్నారు. ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరి వీడనాడాలని కోరారు. అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి సూట బుల్ జాబ్‌లు ఇవ్వకపోవడం సరైంది కాదని చెప్పారు. కొత్త గనులు లేక ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయన్నారు. వెంటనే కొత్త గనులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గుర్తింపు సంఘాన్ని అభాసుపాలు చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. అలాగే కార్మికులపై అధికారులు పనిభారం మోపడం తగ్గించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్, నాయకులు సోంశెట్టి రాజేశం, విక్రమ్‌సింగ్, రమణ, బానయ్య, శర్మ, ఓదెలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేలంను అడ్డుకున్న సంఘాలు క్షమాపణ చెప్పాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) గతంలో బొగ్గు గనుల వేలంను అడ్డుకున్న కార్మిక సంఘాలు కార్మికులకు క్షమాపణ చెప్పాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గనుల వేలంలో పాల్గొని బ్లాకులను దక్కించుకోవాలని గతంలో అనాటి మంత్రికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. కానీ టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ తదితర సంఘాలు అడ్డుకున్నాయని తెలిపారు.

ఓసీపీల్లో ఇకపై మహిళా ఈపీ ఆపరేటర్లు

- జనరల్ అసిస్టెంట్లు, బదిలీ వర్కర్లకు అవకాశం
- దరఖాస్తులు ఆహ్వానిస్తూ యాజమాన్యం ప్రకటన

శ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని ఉపరితల గనుల్లో ఇక నుంచి మహిళా ఈపీ ఆపరేటర్లు పనిచేయనున్నారు. జనరల్ అసిస్టెంట్లు, బదిలీ వర్కర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ సీఎండీ ఎన్. బలరాం అన్ని గనులు, విభాగాలకు సర్క్యులర్లు పంపించారు. జనరల్ అసిస్టెంట్, బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి టూ వీలర్, ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. లైసెన్సును ఆగస్టు 2024కు ముందు పొంది ఉండాలన్నారు. పై అర్హతలను కలిగిన మహిళా ఉద్యగులు తమ గని మేనేజర్, శాఖాధిపతి, జీఎంలకు నిర్ణీత నమూనాలో దరఖాస్తులు అందించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు సిరిసిల్లలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థ ద్వారా హెవీగూడ్స్ వెహికిల్, హెవీ మోటార్ వెహికిల్ విభాగంలో శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఖాళీల లభ్యతను బట్టి నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని ఈపీ ఆపరేటర్ కేటగిరీ-5 డిసిగ్నేషన్‌తో సంబంధిత ఏరియాలకు పంపిస్తామని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని యాజమాన్యం సూచించింది.

సమస్యలపై స్పందన కరువు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ ఎన్ బలరాం కార్మిక సమస్యలను పట్టించుకోకుండా వ్యక్తిగత ఇమేజ్ కోసం పాకులాడుతు న్నారని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఆరోపించారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. స్ట్రక్చర్ సమావేశాల్లో ఎన్ని సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లినా సరిగా స్పందించడం లేదన్నారు. సమావేశం అయిన అనంతరం వారం, పది రోజుల్లో సర్క్యులర్లు ఇవ్వాల్సి ఉండగా, కొన్ని రోజులకు ఇస్తూ తానొక్కడే ఆ సమస్యకు పరిష్కారం చూపినట్లు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు సురేష్, సుధాకర్, నర్సయ్య, లచ్చన్న, సతీష్, అఫ్రోజ్ ఖాన్, పెద్దన్న, శంకరయ్య, ఆడెపు సురేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కాలనీలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, ఉద్యోగులు సహకరించాలని ఆయన కోరారు.

నాగ్‌పూర్-సికింద్రాబాద్ వందేభారత్ రైలుకు

15నుంచి మంచిర్యాల్ స్టేషన్‌లో స్టాప్

హైదరాబాద్, సెప్టెంబర్13 (ఆంధ్రజ్యోతి). ప్రయాణికుల డిమాండ్ మేరకు నాగ్‌పూర్-సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌రైళ్లకు (20101-20102) సెప్టెంబర్ 15 నుంచి మంచిర్యాల్ స్టేషన్‌లో అదనంగా స్టాపేజీని ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది కాలంగా నాగ్‌పూర్- సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. సెప్టెంబర్ 15న కేంద్ర మంత్రి బండి సంజయ్ మంచిర్యాల్ స్టేషన్‌లో జెండా ఊపి అదనపు స్టాపేజీని ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు కాజీపేట, రామగుండం బల్లార్షా, సేవా గ్రామ్, చంద్రపూర్ స్టేషన్లలో వచ్చి వెళ్లేప్పుడు ఆగుతున్న నాగ్‌పూర్-సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇక నుంచి మంచిర్యాల స్టేషన్‌లో సైతం ఆపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

బల్లార్షా-సికింద్రాబాద్ సెక్షన్‌ను తనిఖీ చేసిన రైల్వే జీఎం

బల్లార్షా-సికింద్రాబాద్ సెక్షన్ మధ్య శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రియర్ విండో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే సిర్పూర్ కాగజ్‌నగర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ఆయన సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్‌ను తనిఖీ చేసి ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం శ్రీవాత్సవ మంచిర్యాల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించి ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



వడాల గ్రామంలో మోటార్ ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

భీమిని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్ని గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని వడాల గ్రామంలో శనివారం స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో చేతి పంపుకు మోటారును అమర్చి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెద్దపేట, మల్లీడి, భీమిని, కేస్లాపూర్, ఖర్జీభీంపూర్, వెంకటాపూర్, వీగాం, చిన్నతిమ్మాపూర్, అక్కలపల్లి గ్రామాల్లో ఒక్కో మోటర్ విలువ రూ. 50 వేలతో మొత్తం రూ. 6 లక్షల రూపాయలతో 12 మోటార్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంజాల శ్రీనివాస్ గౌడ్, యువకులు ఉన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలి

ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్

బెల్లంపల్లి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో ముందుకు వెళ్లి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గ ప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని షెడ్యూల్‌కులాల బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు వసతి గృహంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా మని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలు సాధించాలని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో సమయ పాలన పాటిస్తూ కాలాన్ని వృథా చేయకుండా విద్యపై దృష్టి పెట్టాలన్నారు. ఈకార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు

కాసిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమగూడెం ట్యాంకు బస్తీ, లంబాడితండా(కె), సోమగూడెం(కే) గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వరద నీరు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు శనివారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో వర్షాలు పడినప్పుడు ఇళ్ల లోకి నీరు వస్తుందని తెలిపారు. దీంతో నిత్యవసరుకులు, వస్తువులు తడిచిపోతున్నాయన్నారు. ఈవిషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీని పునర్ నిర్మించి వరద నీరు ఇళ్లలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోతకు గురైన కల్వర్టులు



పట్టించుకోని అధికారులు...

రాకపోకలకు ఇబ్బందులు

వేమనపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల మధ్యలో ఉన్న కల్వర్టులు కోతకు గురయ్యాయి. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బుయ్యారం నుంచి వేమనపల్లికి వెళ్లేమార్గంలో బుయ్యారం సమీపంలో ఉన్న కల్వర్టు భారీగా కోతకు గురైంది. భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కేవలం ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే అతి కష్టం మీద వెళ్తున్నాయి.

అలాగే మామిడిపల్లి నుంచి బమ్మెన గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో స్థానికులే తాత్కాలిక మరమ్మతులు చేసుకున్నారు. వర్షం పడితే ఈ తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అలాగే సూరారం గ్రామం నుంచి మామిడిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న ఒర్రెపై మొత్తానికే కల్వర్టు లేకపోవడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికి ఈ ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో సూరారం నుంచి మామిడిపల్లి వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

అలాగే మండలంలోని నీల్వాయి నుంచి మామడ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఒర్రెపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా వరదలకు కొట్టుకుపోవడంతో మోకాళ్ల లోతు నుంచి నీటిలో నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

మామడ గ్రామ ప్రజలు ఏ చిన్న అవసరానికైనా నీల్వాయి గ్రామానికి వెళ్తుంటారు. ఈ రూట్‌లో ఒర్రెపై గతంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా వర్షాలకు కొట్టుకుపోయింది. శాశ్వత వంతెన నిర్మించాలని మామడ గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ ఒర్రె రాకపోకలకు అడ్డంకిగా మారడంతో మామడ నుంచి నీల్వాయికి వెళ్లే విద్యార్థులు, పాల వ్యాపారులు ఇళ్ల వద్దనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

మండలంలోని జిల్లెడ నుంచి జక్కెపల్లికి వెళ్లే మార్గంలో జక్కెపల్లి సమీపంలో ఉన్న ఒర్రెపై నిర్మించిన కల్వర్టు కూడా కోతకు గురైంది. దీంతో స్థానికులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఈ గ్రామాలకు అంబులెన్స్‌లు కూడా రాని పరిస్థితి ఉంది. మండలంలో కురిసిన వర్షాలకు కల్వర్టులు కొన్ని కొట్టుకుపోగా, మరికొన్ని కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి ఒర్రెలపై శాశ్వత వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బుయ్యారం సమీపంలో కోతకు గురైన కల్వర్టు

మామడ ఒర్రెపై శాశ్వత వంతెన నిర్మించాలి: రాజన్న మామడ గ్రామం



నీల్వాయి నుంచి మామడకు వెళ్లే దారిలో ఉన్న ఒర్రెపై శాశ్వత వంతెన నిర్మించాలి. గతంలో నిర్మించిన కల్వర్టు వర్షా లకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తే పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. భారీ వాహనాలు, అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి శాశ్వత వంతెన నిర్మించాలి.







మామిడిపల్లి నుంచి బమ్మెనకు వెళ్లే దారిలో కూలిపోయిన కల్వర్టు, జక్కెపల్లి సమీపంలో కోతకు గురైన కల్వర్టు, మామడకు వెళ్లే దారిలో కొట్టుకుపోయిన ఒర్రెపై నిర్మించిన కల్వర్టు

శాస్త్రీయ నృత్య కళను భావి తరాలకు అందించాలి

హాజీపూర్ : శాస్త్రీయ నృత్య కళను భావి తరాలకు అందించే విధంగా అందరూ కృషి చేయాలని మంత్రి గడ్డం వివేక్ అన్నారు. శనివారం మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 108 మంది మదర్, డాటర్, స్టూడియన్స్‌లతో జయ జయే తెలంగాణ అధికార గీతంపై కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి వివేక్ మాట్లాడుతూ నృత్య శిక్షకులు కళలను కాపాడేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

జన్నారం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలో శనివారం సిద్దివినాయక గ్రామ సమాఖ్య మహిళ సంఘం సభ్యులకు ఆరోగ్య సిబ్బంది కమాలకర్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలం సీజనల్‌లో పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని, వ్యక్తి గత పరి శుభ్రత పాటించాలన్నారు. ఐకేపీ సీసీ కొమురవెల్లి, ఏవోలు దుంపల రమాదేవి, ఆశా కార్యకర్తలున్నారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

మంత్రి వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, ప్రజా సంక్షేమం ప్రత్యేక దృష్టి సారిస్తున్నానని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం చెన్నూరు మున్సిపాలిటీలో రోడ్డు నిర్మాణపనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూరులోని 14వ వార్డులో రూ. 6.80 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం చెన్నూరులోని గోదావరి నది పుష్కరఘాట్‌ను సందర్శించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుందన్నారు. తహసీల్దార్ మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.



చెన్నూరులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వివేక్

మత్స్యశాఖ మహిళా సంఘాలకు చేయూత

భీమారం : ప్రభుత్వం మహిళల ఆర్థిక, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలోని మత్స్యశాఖ మహిళ సంఘాలకు చేయూతనందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం భీమారం మండల కేంద్రంలోని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం భవనంలో కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్‌లతో కలిసి మత్స్యకారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేయడంతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఇందిరా మహిళ శక్తి పథకం, మహాలక్ష్మీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం 134 మంతి మత్స్యకార సహకార సంఘం సభ్యులు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ముదిరాజ్ మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రికి మహిళలు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి మంత్రి పరామర్శ



నివాళులర్పిస్తున్న మంత్రి

కాసిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :కాసిపేట మాజీ వైస్ ఎంపీపీ విక్రమ్ రావు కుటుంబాన్ని శుక్రవారం సాయంత్రం మంత్రి వివేక్‌వెంకటస్వామి పరామర్శించారు. విక్రమ్‌రావు నానమ్మ పూస్కూరి విజయలక్ష్మీ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మంత్రి విక్రమ్‌రావు ను పరామర్శించారు. ఆమెచిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, అక్కెపల్లి శ్రీనివాస్, సత్తయ్య, జంగు, రాజు, సతీష్, రవీందర్‌రావు, నర్సింగ్ ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య

జైపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి సాయిలచ్చన్న పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం తదితర సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుగు గోపాల్, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

చెన్నూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని కస్తూర్బా విద్యాలయంలో శనివారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విద్యాలయం ఆవరణలో 56 మొక్కలు నాటారు. మొక్కలను సంరక్షించాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెంచు కాలనీ కాలనీ వాసులకు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిత్యవసర సరుకులను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు ఇళ్లలో చేరి నిత్యవసర సరుకులు పూర్తిగా పాడైపోవడంతో మంత్రి వివేక్‌వెంకటస్వామి స్పందించి కావాల్సిన డబ్బులు సమకూర్చడంతో స్థానిక నాయకులు నిత్యవసర సరుకులను అందించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొత్కు సుదర్శన్ మాట్లాడుతూ మంత్రి నీట మునిగిన కాలనీలోని ఇళ్లను పరిశీలించి సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించడంతో సరుకులు అందించామన్నారు. కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సన్మానం



సత్తిరెడ్డిని సన్మానిస్తున్న కాలనీ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌పీడీసీఎల్ 1104 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బొమ్మ సత్తిరెడ్డిని శనివారం రెడ్డి పరివార్ కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, మనద్మరెడ్డి, రమేష్ రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మీనారెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సీతారాం ఏచూరి వర్ధంతి

తాండూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శనివారం తాండూర్ ఐబీ కేంద్రంలో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు నానయ్య, శంకర్, రాజేశం, తిరుపతి, చందు ఉన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

చెన్నూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆస్నాద, నాగాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా బస్తాలు రాగా నాగాపూర్‌లో 222 యూరియా బస్తాలను పోలీసుల పహారా మధ్య రైతులకు పంపిణీ చేశారు. ఆస్నాదకు 222కు యూరియా బస్తాలు రాగా రైతు వేదిక వద్ద పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఈ క్రమంలో యూరియా కోసం 600 మంది రైతులు రాగా అధికారులకు ఏం చేయాలో తోచలేదు. దీంతో రైతులు యూరియా అందరికి పంపిణీ చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో చేసేదేం లేక అధికారులు యూరియా పంపిణీని నిలిపివేశారు. ఈ సదర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులందరికి సక్రమంగా కావాల్సిన యూరియా అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే రైతులకు సరిపడ యూరియా అందించాలని కోరారు.



ఆస్నాద గ్రామంలోని రైతు వేదిక వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

పోలీస్ పహారాలో యూరియా టోకెన్ల పంపిణీ

నెన్నెల : మండలంలోని నందులపల్లి గ్రామంలో శనివారం అధికారులు యూరియా టోకెన్లను పంపిణీ చేశారు. యూరియా టోకె న్ల కోసం రైతులు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. దీంతో ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీస్ పహారా మధ్య యూరియా టోకెన్లను పంపిణీ చేశారు. ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నెన్నెల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 260 బస్తాల యూరియా మాత్రమే అందు బాటులో ఉండటంతో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున మా త్రమే టోకెన్లు ఇచ్చారు. టోకెన్లు లభించని చాలా మంది రైతులు నిరాశగా వెనుదిరి గారు. టోకెన్ పొందిన వారు నెన్నెల గోదాంకు వెళ్లి యూరియా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన తెలిపారు. దశలవారిగా అన్ని గ్రామాలకు యూరియాను పంపిణీ చేస్తామన్నారు. పనులన్నీ మానుకోని పొద్దంతా క్యూలైన్ లో నిలబడితే ఒకేఒక యూరియా బస్తా కోసం టోకెన్ ఇచ్చారని ఒక్క బస్తా దేనికి సరిపోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు ఎరువులు వేసే సమయం దాటి పోతుందని ఇప్పటికైనా సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు.

కబ్జానా..రక్షణ చర్యలా..

(5వ పేజీ తరువాయి)

ఎందుకు చేయాల్సి వచ్చిందని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని ఆక్రమించే యత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు స్థలంలో పాతిన పోల్స్‌ను వెంటనే తొలగించడం ద్వారా పాఠశాల భూమిని కాపాడాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఇలా..

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో లే అవుట్ వెంచర్లు ఏర్పాటు చేసేవారు పలు నిబంధనలను అమలు పరచాల్సి ఉంటుంది. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019, పంచాయతీ చట్టం- 2018 ప్రకారం మొత్తంలో లే అవుట్ స్థలం నుంచి 10 శాతం గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు మరో 30 శాతం ప్రజల అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. ఆ 30 శాతంలో మంచినీటి ట్యాంకులు, పాఠశాల, గుడి, తదితర ప్రజోపకర పనులు మాత్రమే చేపట్టాల్సి ఉంది. అందుకు భిన్నంగా హైటెక్ సిటీలో స్కూల్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఇతర పనులకు వినియోగించే ప్రయత్నం చేయడం వివాదాస్పదమైంది. దాదాపు 20 సంవత్సరాల పాటు స్థలం ఖాళీగా ఉండటంతో సహజంగానే దానిపై ఇతరుల కళ్లు పడుతున్నాయన్న అభిప్రాయాలను కాలనీ వాసులు వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్థలం చుట్టూ బౌండరీలు ఏర్పాటు చేసి, కబ్జాలకు గురికాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

దండేపల్లి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2003-04 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు రూ 15వేల విలువ గల కంప్యూటర్‌కు పాఠశాలకు బహూకరించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందానికి కంప్యూటర్, సామగ్రిని అందజేశారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు గజిటేడ్ ప్రధానోపాధ్యాయుడుగా పదోన్నతి పొందిన సందర్భంగా పూర్వ విద్యార్థులు కంప్యూటర్ అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. పాఠశాలల అభివృద్ధికి విరాళాలు అందించడం అభినందనీయ హెచ్‌ఎం రాజేశ్వర్‌రావు అన్నారు. పూర్వ విద్యార్థులు అల్లంల కుమారస్వామి యాదవ్, అడెపు నగేష్, రవికుమార్, అశోక్, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నెన్నెల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను నెన్నెలలో మండల కాంగ్రెస్ నాయకులు శనివారం బాధిత కుటుంబాలకు అందజేశారు. నెన్నెల గ్రామానికి చెందిన గంగిషెట్టి శంకరి, కీసరి విష్ణు, గొల్లపల్లి గ్రామానికి చెందిన కర్నజ్యోతి, అస్మిత, జంగల్‌పేటకు గ్రామానికి చెందిన ఇప్ప మల్లిక, కొత్తూరుకు చెందిన షేక్ ఫాతిమా, గుండ్లసోమారం కు చెందిన దుగుట లింగయ్య కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యపాలై చికిత్స కోసం చేసిన ఖర్చులు చెల్లించాలని దరఖాస్తు చేసుకోగా వారికి సీఎం ఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు మల్లేష్, మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్ నాయకులు పోచమల్లు, కిరణ్, చిరంజీవి పాల్గొన్నారు.

జేపీవోల సేవలు వినియోగించుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

లక్షెట్టిపేట, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాలకు జేపీవోలను నియమించిందని వారి సేవలను కార్యాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శనివారం లక్షెట్టిపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్జీ దారులు సాదా బైనామా దరకాస్తు చేసుకున్న పారాన్ని డౌన్‌లోడ్ చేసి క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, డిప్యూటి తహసీల్దార్ శ్రావణి, సీనియర్ అసిస్టెంట్ నవనీత్ తదితరులు ఉన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

జైపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామానికి చెందిన గోదారి అరవింద్(19) అనే యువకుడు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. అరవింద్ ఆర్మీ కోసం కరీంనగర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఆర్మీ పరీక్షలు రాసిన అరవింద్ ఈవెంట్స్‌కు ప్రయత్నిస్తుండగా కాలు బెణికి రన్నింగ్ చేయలేకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో వేలాల గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు గోదారి చిన్న మల్లక్క- రాయమల్లు పొలం పనులకు వెళ్లగా అరవింద్ గడ్డి మందు తాగాడు. ఈ విషయం పొలం దగ్గరికి వచ్చి తండ్రికి తెలిపాడు. అరవింద్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

తిరుపతి వరకు రైలు పొడిగింపు

మంచిర్యాల కలెక్టరేట్/కాగజ్‌నగర్ సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రక్సల్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (07052/51)ను తిరుపతి రైల్వేస్టేషన్ వరకు పొడిగించినట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పొడిగింపు ఈ నెల 20వ తేదీ నుంచి అమలులోకి వస్తుందన్నారు. ఈ నెల 20న తిరుపతి నుంచి, 23వ తేదీన రక్సల్ నుంచి బయలు దేరుతుందన్నారు. ఈ రైలును వయా లింగంపల్లి, వికారాబాద్, రాయ్‌చూర్, గుంతకల్లు, కడప, రేణిగుంట మీదుగా తిరుపతి వరకు పొడిగించినట్లు తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల రైల్వేస్టేషన్‌ల నుంచి తిరుపతికి వెళ్లే వారికి ఈ రైలు ఎంతో ఉపయోగపడుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

లక్షెట్టిపేట, సెప్టెంబరు, 13(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేటలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదివేందుకు విద్యాశాఖ మండలి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ మహాత్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మీషన్ల కోసం దోస్త్‌ఆప్ ద్వారా ఈనెల 15,16 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 17న సీటు కన్ఫర్మేషన్ కళాశాలలో ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ మంచిర్యాల చారిటబుల్ ట్రస్ట్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెనె హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరి నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలోని మంచిర్యాల క్లబ్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తారని, ప్రజలందరు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కబ్జానా..?

రక్షణ చర్యలా..

- స్థలం చుట్టూ ఫెన్సింగ్ వెనుక మతలబేమిటి
- భూమిని కబ్జా చేసేందుకేనంటున్న కాలనీవాసులు
- స్థలాన్ని కాపాడేందుకే రక్షణ చర్యలంటున్న డెవలపర్స్
- చర్చనీయాంశమైన రూ. కోట్లు విలువ చేసే భూమి
- హైటెక్ సిటీలో స్కూల్ కోసం కేటాయించిన స్థలంపై కన్ను
- ఇతరత్రా నిర్మాణాలు చేపట్టరాదంటూ బోర్డు ఏర్పాటు



హైటెక్‌సిటీలో వివాదాస్పదమైన పాఠశాల స్థలం, మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

మంచిర్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీలో పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. రూ. 20 కోట్ల వరకు ఖరీదు చేసే ఎకరం స్థలాన్ని కబ్జా చేస్తున్నారంటూ హైటెక్‌సిటీ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు మున్సిపల్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లకు సైతం సమాచారం అందించారు. స్పందించిన మున్సిపల్ అధికారులు సదరు స్థలం కాలనీ డెవలపర్స్ పాఠశాల ఏర్పాటు కోసం మున్సిపాలిటీకి కేటాయించారని, అందులో స్కూల్ బిల్డింగ్ మినహా, ఇతరత్రా నిర్మాణాలు చేపడితే మున్సిపాలిటీల చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకుంటాం అని పేర్కొంటూ కమిషనర్ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు.

ఖరీదైన స్థలం కావడంతో...

2006లో హైటెక్‌సిటీ వెంచర్ ఏర్పాటు సమయంలో లే అవుట్ నిబంధనల మేరకు డెవలపర్స్ ఎకరం స్థలాన్ని స్కూల్ బిల్డింగ్ నిర్మాణం కోసం కేటాయించారు. సర్వే నంబర్లు 366,367,368, 371 నుంచి 392, 397, 399, 405లో మొత్తం 68.95 ఎకరాల భూమికి లే అవుట్ అనుమతులు పొందారు.

ఇందులోపైన పేర్కొన్న ఎకరాన్ని ప్రత్యేకంగా పాఠశాలకు కేటాయించారు. హైటెక్‌సిటీ నగర నడి బొడ్డున ఉండటం, కాలక్రమేణ కాలనీకి ప్రాధాన్య త పెరగడంతో అక్కడి ప్లాట్ల ధరలకు కూడా డిమాం డ్ ఏర్పడింది. హైటెక్ సిటీలో ఎక్కడ చూసినా చదర పు గజం కనీసం రూ. 50వేల పైచిలుకు ధర పలుకుతోంది. హైటెక్‌సిటీలో నిర్మించిన హరిహర క్షేత్రం దేవాలయం వెనుకాల ఉన్న ఎకరం స్థలాన్ని పాఠశాలకు కేటాయించినట్లు లే అవుట్ ప్లాన్‌లోనూ పొందుపరిచారు. కాలనీ భూముల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో పాఠశాల స్థలంపై అక్రమార్కుల కళ్లు పడుతున్నాయి.

ఇంతకు ముందు ఇదే స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసిన కొందరు అందులో ప్లాట్లు ఏర్పాటు చేస్తూ హద్దురాళ్లు సైతం పాతారు. సమాచారం అందుకున్న మున్సిపల్ అధికారులు హద్దు రాళ్లను తొలగించి, స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు స్థలం చుట్టూ పాత ఫెన్సింగ్ ఉండగానే, కొత్తగా సిమెంట్ స్తంభాలు పాతి రేకులు ఏర్పాటు చేసేందుకు యత్నించారు. స్థలంలో పెరిగిన మొక్కలను కొట్టి వేశారు. భూమి చుట్టూ పాత ఫెన్సింగ్ ఉండగానే, కొత్తగా పోల్స్ పాతి ఐరన్ షీట్స్ పెట్టే ప్రయత్నం...

(తరువాయి 7లో)

పాఠశాల నిర్మాణం కోసమే..
హైటెక్‌సిటీ డెవలపర్ అంజద్

హైటెక్‌సిటీలో స్కూల్ కోసం కేటాయించిన ఎకరం స్థలంలో పాఠశాల భవన నిర్మాణం చేపట్టేందుకు సన్నా హాలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే మొదట స్థలం చుట్టూ ఇనుప రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నాం. నిబంధనల మేరకు సదరు స్థలంలో పాఠశాల కోసం భవన నిర్మాణాన్ని చేపట్టబోతున్నాం. రాబోయే రోజుల్లో అందుకు అవసరమైన అనుమతులన్నీ తీసుకున్న తరు వాత పనులు ప్రారంభిస్తాం.

ఇతరత్రా నిర్మాణాలు చేపట్టరాదు
మున్సిపల్ కమిషనర్ సంపత్

మున్సిపాలిటీల చట్టం-2019 ప్రకారం పాఠశాలకు కేటాయించిన స్థలంలో ఇతరత్రా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధం. సదరు స్థలంలో కేవలం పాఠశాల భవ నం నిర్మాణం మాత్రమే చేపట్టాల్సి ఉంటుంది. గతంలో కొందరు స్థలంలో అక్రమంగా ప్లాట్లు ఏర్పాటు కోసం యత్నించారు. ఆ చర్యలను అడ్డుకున్నాం. భవిష్యత్తులో ఎవరు కబ్జాకు యత్నించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు.

బీఆర్ఎస్ పని అయిపోయింది..

- బొగ్గు గనుల వేలం పాటలతోనే సింగరేణికి భవిష్యత్తు
- మంత్రి వివేక్‌వెంకటస్వామి



మందమర్రిలో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, ఫ్రస్టేషన్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుత్వంపై లేని పోని విమర్శలు చేస్తున్నాడని రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం మందమర్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. లోటు బడ్జెట్ ఉన్నా సంక్షేమపథకాలకు పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తుందన్నారు. ఫార్ములా వన్ రేస్ కేసులో రూ. 50 కోట్ల కుంభకోణానికి సంబంధించి ప్రభుత్వంపై దుర్భాషలాడుతున్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నాడన్నారు. బీఆర్ఎస్ కుంభకోణాల్లో మునిగిపోయిందని, కేసీఆర్ కూతురు కవిత చేస్తున్న ఆరోపణలకు వారి వద్ద జవాబు లేదన్నారు. ప్రభుత్వంపై విమర్శలు మానుకుని ప్రజల కోసం పనిచేస్తే హ ర్షిస్తామన్నారు. కుంభకోణాలు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. సింగరేణిలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడాలంటే తప్పనిసరిగా బొగ్గు గనుల వేలం పాటలు అవసరమన్నారు. వేలం పాటలో పాల్గొంటామని ఉపముఖ్య మంత్రి చెప్పడం హర్షిం చదగ్గ పరిణామమన్నారు. ఈ నెల 15న జరగనున్న కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, బండి సదానందం యాదవ్, ఎర్ర రాజు, రాకం సంతోష్, ఇసాక్, గణేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు రాకుండా చర్యలు చేపడతాం

వర్షాలతో వరద నీరు చేరుతున్న కాలనీల్లో నీరు చేరకుండా తగిన చర్యలు చేపడతామని మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీలో వర్షాలకు వరద నీరు చేరిన చెంచు కాలనీ, ఎస్సీ ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. ప్రజలను సమ స్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ కాలనీల్లో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వచ్చేలా చూస్తానని తెలిపారు. వరదల్లో నిత్యవసర సరుకులు కోల్పోయిన వారికి బియ్యం, నిత్యవసర సరుకులు అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజలింగుకు, రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం కాలనీ వాసులు మంత్రికి వినతి పత్రం ఇచ్చారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ



మంచిర్యాల పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీపీ, డీసీపీ, ఏసీపీ

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. శనివారం రాత్రి మంచిర్యాల పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మొదట గోదావరి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు రోడ్డు పై తిరిగినప్పుడే ప్రజలకు భరోసా కలుగుతుందన్నారు. నిషేధిత లిక్కర్ బెల్ట్‌షాపులు నిర్వహించొద్దన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్



కేసును పరిష్కరిస్తున్న జడ్జి సాయికిరణ్

లక్షెట్టిపేట, సెప్టెంబరు, 13 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గం అని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కసమల అన్నారు. శని వారం పట్టణ న్యాయస్థానంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ చిన్న చిన్న విషయంలో తగా దాలు పెట్టుకుని విలువైన సమయంను కోర్టుల చుట్టు తిరిగి తమ సమయం వృధా చేసుకోకూడదని కక్షిదారుల సౌకర్యార్థం న్యాయ సేవాధికార సంస్థ ఈ అవకాశం కల్పించిందన్నారు. లక్షెట్టిపేట న్యాయ స్థానం పరిధిలో కక్షిదారులు రాజీ పడ్డ సుమారు 562 కేసులను జడ్జి పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఏజీపి సత్యం, సీనియర్ న్యాయవాదులు భూంరెడ్డి, కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, నళినికాంత్, కిరణ్ కుమార్, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 3500 కేసుల పరిష్కారం

మంచిర్యాలక్రైం: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా 3500 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ. నిర్మల, సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు కవిత, నిరోష, కృష్ణతేజలతో కలిసి ఆయన హాజరయ్యారు.

చెన్నూరు: చెన్నూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జడ్జి పర్వతపు రవి ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్‌ను నిర్వ హించారు. ఇందులో మొత్తం కేసులు 1050 కాగా ఇందులో డ్రంకెన్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు 988 కాగా రూ. 5,29,650 జరిమానా కింద వసూలైనట్లు జడ్జి తెలిపారు. బ్యాంకు కేసులు 42 కాగా రూ. 20,88,783 వసూలుతో పరిష్కారం అయ్యాయన్నారు. అలాగే 39 క్రిమినల్ కేసులు, 2 సివిల్ కేసులు రాజీపడ్డారన్నారు.

మహిళా రక్షణే షీటీం ధ్యేయం

81 మంది పోకిరీలపై కేసులు నమోదు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే షీటీం ధ్యేయమని ఈ సంవత్సరం 81 మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నామని మంచిర్యాల డీసీపీ బాస్కర్ అన్నారు. డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మా ట్లాడుతూ మహిళలకు షీటీం అండగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులో మంచిర్యాల జోన్ పరిధిలో మొత్తం 114 ఫిర్యాదులలో 18 క్రిమినల్ కేసులు, 7 పెట్టి కేసులు, 89 కౌన్సిలింగ్‌లు నిర్వహించామన్నారు. బాధిత మహిళలకు పోలీసులు అండగా ఉంటుందన్నారు. పాఠశాలలు, కళాశాలలు జిల్లా ప్రధాన కూడళ్ల వద్ద బస్టాండు ప్రాంతాల్లో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

భరోసా సెంటర్‌లో లీగల్ అడ్వయిజర్ కౌన్సిలర్, మెడికల్ ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, బాలికలకు సంబంధించిన కేసు పోలీసు స్టేషన్‌లో నమోదైన సమయం నుంచి బాధితులకు సపోర్ట్‌గా వారి మానసిక స్థితి, వారి విద్య, పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు సమా చారం చేసుకోవాలన్నారు. పిల్లల పోర్న్ వీడియోలు, హత్యాచారం, సామూహిక అత్యాచారం, వీడియోలు అప్ లోడ్ చేయడ,ం డౌన్ లోడ్ చేయడం ఐటీ యాక్ట్‌లోని సెన్ 57 బిలోని నేరంగా పరిగణి స్తారన్నారు. ఈ సమావేశంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ నరేశ్ కుమార్, మంచిర్యాల జోనల్ షీటీం ఇన్‌చార్జి మహిళా ఎస్ఐ ఉషారాణి, హైమా, భరోసా సెంటర్, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం..

గరిష్టంగా 89.6 మి.మీ వర్షపాతం నమోదు



నెన్నెలలో గండి పడిన గుండ్ల చెరువు మత్తడి

మంచిర్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల్లో భారీ వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లాయి. జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు ఉధృతంగా ప్రవహించింది. బైపాస్ రోడ్డులోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద కాజువే వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో రాళ్ల వాగు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి.

- జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 29.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గరిష్టంగా నెన్నెల మండలంలో 89.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, కాసిపేట మండలంలో 77.6 మి.మీ, మందమర్రి మండలంలో 58.2 మి.మీ, బెల్లంపల్లి మండలంలో 47.4 మి.మీ, చెన్నూరు మండలంలో 38.6 మి.మీ, వేమనపల్లి మండలంలో 30.4 మి.మీ, హాజీపూర్ మండలంలో 28.8 మి.మీ, మంచిర్యాల జిల్లా కేంద్రంలో 24.2 మి.మీ, కోటపల్లి మండలంలో 23.8 మి.మీ వర్షం కురిసింది.

రెండు చెరువులకు గండి

నెన్నెల : మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లాయి. ఆవడం శివారులో చిలుక సముద్రం చెరువు, గుండ్ల చెరువు మత్తళ్లకు గండ్లు పడ్డాయి. వరి పొలాల గట్లకు భారీగా గండ్లు పడి ఇసుక మేటలు వేశాయి. గుండ్ల చెరువు కింద పలువురి పంట పొలాలు, చిలుక సముద్రం చెరువు కింద కొందరి పొలాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

'విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి'

లక్షెట్టిపేట, సెప్టెంబరు;13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని మంచిర్యాల జిల్లా సహాయ సెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సురేష్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణతో శనివారం కళాశాలలో చదివే బాలుర వసతి గృహం విద్యార్థులు, పేరెంట్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థులకు వసతి గృహాల్లో ఏలాంటి సమస్యలు ఉన్న నేరుగా వార్డెన్ దృష్టికి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి బాలసంకుల రాజగోపాల్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మన్ రావు, అద్యాపకులు అశోక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాలను అక్టోబరు 31లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులు, రైసుమిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 31లోగా సీఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేసేలా అధికారులు, రైసుమిల్లర్లు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రైసుమిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్‌చేసి సీఎంఆర్ చేయాలని సూచించారు. సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయని రైసుమిల్లులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లామేనేజర్ శ్రీకళ, రైసుమిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల సౌకర్యార్థం పొలంబాట

లక్షెట్టిపేట విద్యుత్‌శాఖ ఏఈ



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

లక్షెట్టిపేట, సెప్టెంబరు, 13(ఆంధ్రజ్యోతి): రైతులు సౌకర్యార్థం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ గణేష్ అన్నారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని మోదెల గ్రామంలో అధికారులు, సిబ్బంది పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పంట పొలాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఎర్తింగ్‌లను ఏర్పాటు చేసారు. మోదెల శివారులో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంబాలు వంగి ఉన్నట్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకుపోవడం వాటిని కూడా సరి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంట ఎఫ్ఎం నర్సింగ్‌రావు, లైన్ ఇన్స్‌పెక్టర్లు సత్యనారాయణ, రవికుమార్, లైన్‌మెన్ భూమన్న, రైతులు ఉన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో మాట్లాడారు. భౌతిక దాడులకు పాల్పడవద్దన్నారు. ఈ నెల 12న దండేపల్లి మండలం దమ్మన్నపేట, మామిడిగూడ గ్రామాల్లో గిరిజన ఘటనపై దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా సామరస్యంతో ముందుకు వెళ్లాలన్నారు. అటవీ ప్రాంతాల్లో కమ్యూనిస్టు ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ కింద గిరిజనులు వెదురు పంట సాగుకు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఇందుకు గుంతలు తవ్వడం, మొక్కలకు నీటిని అందించడం, యూరియా ఇతర పనులకు నిధులు మంజూరు చేయడమేకాకుండా వెదురుపంటను విక్రయించుకుని ఆదాయం పొందేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, గిరిజనుల ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ జనాభా ఉన్నా.. గ్రామ పంచాయతీగా ఏర్పాటు

పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చట్టంలో నిర్దేశించిన విధంగా 500 మంది జనాభా లేకపోయినప్పటికీ తప్పుడు డేటా ఆధారంగా ఒక గ్రామాన్ని విభజించి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. తాజా వివరాలతో మళ్లీ నిర్ణయం తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసింది. జిల్లాలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీని విభజించి కొత్తగా వందూర్‌గూడ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 317 మంది జనాభా మాత్రమే ఉన్నప్పటికీ తప్పుడు లెక్కలతో పంచాయతీ విభజన చేశారని.. డేటాను వెరిఫై చేయకుండానే నూతన పంచాయతీ ఏర్పాటు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. డేటాను పరిశీలించి తాజాగా మళ్లీ నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



జన్నారం,సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి):స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆదిలాబాద్ జోనల్ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండ్ -19 ఇయర్స్ 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో మండలంలోని ఇందన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న రేవంత్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో విద్యార్థులు ఆటల్లో ప్రతిభ కనబరిస్తే ఉన్నత స్థాయిలో ఉంటారని ప్రతిభ కనబరిచిన విద్యార్థి రేవంత్, ఫిజికల్ డైరెక్టర్ శివనూరి తిరుపతిని అభినందించారు.